ప్రభుత్వ యూనివర్సిటీల్లోని సమస్యలు పరిష్కరించాలి


విద్యా మండలి వైస్‌చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నేతలు శుక్రవారం ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పాడవంగి నాగరాజు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలలో చాలా కాలంగా మెస్ బిల్లులు బకాయిపడ్డాయన్నారు. పీజీ కోర్సులలో సీటు పొందిన ప్రతి విద్యార్థికి ఎటువంటి షరతులు లేకుండా హాస్టల్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. అన్ని యూనివర్సిటీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హాస్టల్ భవనాలు నిర్మించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సాకుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద నవీన్, రాష్ట్ర నాయకులు తీగల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వే 63శాతం పూర్తి

జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


కాచిగూడలో సర్వేను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కాచిగూడ: శుక్రవారం మోతీమార్కెట్, నింబోలి అడ్డ, ఇసామియాబజార్, చెప్పల్‌బజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి కుటుంబ సర్వేలను ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ పరిధిలో 63శాతం సర్వే పూర్తయ్యిందని మేయర్ విజయలక్ష్మి తెలిపారు. కలిసి స్థానికుల వివరాలను సర్వే ఫామ్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈనెల చివరి వరకు పూర్తి స్థాయిలో సర్వే పూర్తి చేస్తామన్నారు. అవసరమైతే మరికొన్ని రోజులు పొడిగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఎంసీ మారుతీదివాకర్, ఈఈ రమేష్, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో పాలుపంచుకోవాలి


సుందరయ్యపార్కులో టాయిలెట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం సుందరయ్యపార్కులో ఇటీవల నిర్మించిన టాయిలెట్లను రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఆరు సంవత్సరాలుగా తాను ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవిచారి, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, ఆర్.వివేక్, బి.వెంకటస్వామిగౌడ్, బబ్లూ, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి

లిబర్టీ: రైతులు, గిరిజనులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వీ కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫార్మ పరిశ్రమకు వ్యతిరేకంగా రైతులు, గిరిజనులు ఉద్యమిస్తుంటే అక్రమ కేసులు పెట్టించి జైలు పాలు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. లగచర్లలో జాతీయ మానవ హక్కుల కమిషన్ బృందం పర్యటించి నిజాలను తెలుసుకోవాలని ఆయన కోరారు. రెవెన్యూ అధికారులు అనుసరించిన విధానం వల్లనే ఘర్షణ జరిగిందని, కేసులు ఎత్తివేయకుంటే దళిత, గిరిజన సంఘాలను రాజకీయ పక్షాలను సంఘటితం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

‘తెలంగాణలో వచ్చేది బీసీల రాజ్యమే’

కాచిగూడ: తెలంగాణలో వచ్చేది బీసీల రాజ్యమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో నిర్వహించనున్న ‘బీసీల సమరభేరి’ సభకు పార్టీలకతీతంగా బీసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీకు రాజ్యాధికారం ఇప్పుడు కాకుంటే మరెప్పుడు రాదని, అందువల్ల బీసీలందరూ సంఘటితం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో నీల వెంకటేశ్, తంగెళ్లముడి నందగోపాల్, ఎల్.కృష్ణ, సుధాకర్, వీరన్న, ఉదయ్ నేత, రఘుపతి, అనంతయ్య, లక్ష్మీనారాయణ, రాజేందర్, బాలయ్య, హేమంత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధన పోరాటంలో భాగస్వాములవుదాం


సమావేశంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్ల ఐక్యవేదిక ప్రతినిధులు

కవాడిగూడ: మాజీ ప్రజాప్రతినిధుల న్యాయమైన డిమాండ్ల సాధనకై జరిగే పోరాటాలలో అందరం భాగస్వాములం అవ్వాలని తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడలో రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా సంతాప తీర్మానం ప్రవేశపెట్టి, పలు డిమాండ్లపై చర్చించారు. త్వరలో రాష్ట్ర, జిల్లా కమిటీలను ఎన్నుకోవాలని తీర్మానించారు. అనంతరం మేడి శకంర్ మాట్లాడుతూ... గతంలో సర్పంచ్‌లుగా ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, కౌన్సిలర్‌లుగా ప్రజలకు సేవలు అందించిన మాజీ ప్రజాప్రతినిధులు నేడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. మాజీ ప్రజా ప్రతినిధులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజప్తి చేశారు. మాజీ ప్రజాప్రతినిధులకు పెన్షన్ ఇవ్వాలని, ఆరోగ్య బీమా అందించాలని, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, భూమిలేని వారికి భూమి, ఇల్లులేనివారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ బొడ్డు దేవయ్య, నాయకులు గోపాల్, యాదయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి, మహ్మద్ అబ్దుల్ రహీమ్, మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ లైబ్రరీలో చదువుకొని..
గ్రూప్–4 ఉద్యోగం సాధించి.!


ఉద్యోగం సాధించిన జి.గణేశ్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి పద్మజ

చిక్కడపల్లి: చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం అన్ని వసతులు కల్పించామని నగర గ్రంథాలయ కార్యదర్శి పొట్లూరి పద్మజ అన్నారు. నగర గ్రంథాలయంలో చదువుకున్న జి.గణేశ్ కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. శుక్రవారం గ్రంథాలయంలో గణేశ్‌ను ఘనంగా సన్మానించారు. పద్మజ మాట్లాడుతూ... గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థలకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు వెంకటేశ్‌యాదవ్, సుకేశ్‌కుమార్, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

చలి కాలం.. జర భద్రం

- ఆరోగ్య జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు
- ఉన్ని దుస్తులు ధరించాలని సూచన



నల్లకుంట: చలికాలం వచ్చేసింది. వాతావరణంలో సంభవించిన పెను మార్పుల కారణంగా పగటి ఉష్ణోగ్రతలు కనిష్టంగా 15 డిగ్రీలు కాగా గరిష్ట ఉష్ణోగ్రతలు 29 డిగ్రీల సెల్సియస్ దాటడం లేదు. అంబర్‌పేట నియోజక వర్గంతో పాటు హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలలో నిత్యం పొగమంచు కురుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అనేక జాగ్రత్తలు తీసుకోవాలని ఫీవర్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రాజేంద్రప్రసాద్ సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

చల్లని గాలులు వీస్తుండడంతో ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసి ఉంటుంది. పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, కూలీలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయాన్నే వాకింగ్, జాగింగ్ చేసే వారు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోకుంటే జబ్బుల బారిన పడాల్సి వస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆస్మా జబ్బు ఉన్న వారు శీతాకాలంలో వాకింగ్‌కు వెళ్లకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరిగే కొద్దీ శ్వాస కోస వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున ఉదయాన్నే బయటకు వెళ్లకపోవడమే ఉత్తమమని, వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం..

వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో, పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్యం. దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. దోమ కుడితే టైఫాయిడ్, డెంగీ, చికూన్ గున్య, మెదడువాపు, విష జ్వరాలు వచ్చే అవకాశాలుంటాయి. తాగునీటి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. తాగునీటి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని కాచి చల్చార్చిన నీటిని తాగడం శ్రేయస్కరమని, వేడి వేడి ఆహార పదార్థాలనే తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. వంట పాత్రలపై విధిగా మూతలు పెట్టాలని, దోమ తెరలు వాడాలని సూచిస్తున్నారు.

ఉన్ని దుస్తులు ధరించాలి..

చలి పెరగడంతో శీతాకాలం దుస్తులు విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేస్తారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడేవారు, జ్వరం, దగ్గు సమస్యలున్న వారు వెచ్చని వాతావరణంలో ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు, చిన్నారులతో పాటు అన్ని వయస్కుల వారు తమకు అనుగుణంగా స్వెటర్లు, జర్కిన్, మంకీ టోపీలు ధరించడం మేలు. శీతలపానీయాలకు, ఐస్ క్రీంలకు దూరంగా ఉంటూ.. బయటికి వెళ్లినప్పుడు చెవుల్లోకి గాలి దూరకుండా దూది పెట్టుకోవడం మంచిదని చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవు



చలికాలంలో ప్రతి ఒక్కరూ విధిగా తగు జాగ్రత్తలు పాటించాలి. శీతాకాలంలో ముఖ్యంగా జలుబు, జ్వరం, ఫ్లూ వంటివి వ్యాపించే ప్రమాదం ఉంది. జాగ్రత్తలు పాటించకుంటే ఆరోగ్య సమస్యలు తప్పవు. అందువల్ల ప్రతి ఒక్కరూ శీతాకాలం ముగిసే వరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఫీవర్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

కాచిగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో అర్హులైన 31మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను కాచిగూడ కార్పొరేటర్ ఉమాతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ఆధ్యాత్మిక భావనతో పాటు ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గౌరీశంకర ఆలయ కమిటీ చైర్మన్ పి.శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో ముషీరాబాద్ నాగదేవత దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ నాగదేవత ఆలయంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ సేవలు చేస్తూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను శ్రీధర్‌చారి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు ముఠా జైసింహ, శ్రీధర్‌రెడ్డి, డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ప్రభాకర్, ఎయిర్‌టెల్ రాజు, భాస్కర్, వంగాల నర్సింగ్‌రావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

చెట్ల కొమ్మలు తొలగించరా.?


విజ్ఞానపురికాలనీ మెయిన్ రోడ్డులోని ఫుట్‌పాత్‌పై చెట్ల కొమ్మల కుప్ప

నల్లకుంట: నల్లకుంట డివిజన్‌లో ఎక్కడ చూసినా నరికేసిన చెట్ల కొమ్మల కుప్పలే కనిపిస్తున్నాయి. ఓయూ రోడ్డు ఎస్‌వీఈఎస్ పాఠశాల రోడ్డులో రెండు వారాల క్రితం రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి వదిలేశారు. ముఖ్యంగా విజ్ఞానపురికాలనీ ప్రధాన రహదారిలో నరికి వేసిన చెట్ల కొమ్మలను కనకదుర్గ మెకానిక్ షాప్ పక్కన ఫుట్‌పాత్‌పై కుప్పగా పడవేశారు. దీనికి తోడు స్థానికంగా ఉన్న కొందరు తమ ఇళ్లల్లోని పాత చెక్క వస్తువులు, వ్యర్థాలను తీసుకువచ్చి ఈ చెట్ల కొమ్మల కుప్ప వద్ద పడవేసి వెళ్లారు. ఈ కారణంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొని దుర్గం వెదజల్లుతోందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగింపచేయాలని ప్రజలు కోరుతున్నారు.

యాదవులు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోవచ్చు


సదర్ సమ్మేళన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎడ్ల హరిబాబుయాదవ్

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా యాదవులు ఐక్యగా ఉన్నప్పుడే న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో రామన్నపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న జరిగే సదరు ఉత్సవాల బ్రోచర్‌ను ఎడ్ల హరిబాబుయాదవ్ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రామన్నపేట యాదవ సంఘం ప్రతి సంవత్సరం సదరు ఉత్సవాలను నిర్వహిస్తూ యాదవుల్లో ఐక్యతను పెంపొందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి వర్కింగ్ ప్రెసిడెంట్ అయోధ్యయాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దుర్గయ్య, మండల అధ్యక్షుడు మల్లికార్జున్, కార్యదర్శి నర్సింహ, ఉపాధ్యక్షుడు జంగయ్య, విద్యావంతుల వేదిక మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, నాయకులు సత్యనారాయణ, నరేష్, లింగస్వామి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

యువ పురస్కారం ప్రదానం

సాక్షి,సిటీబ్యూరో: నగరానికి చెందిన శ్వేత ప్రసాద్ కర్ణాటక సంగీతం విభాగంలో 2022–23 సంవత్సరానికి గాను బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందుకున్నారు. శుక్రవారం ఢిల్లీలో సాంస్కృతిక శాఖ కార్యదర్శి అరుణిష్ చావ్లా, సంయుక్త కార్యదర్శి ఉమ నందూరి, సంగీత నాటక అకాడమీ వైస్ చైర్మన్ సంధ్య చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.

పాలిటెక్నిక్ కళాశాల అలుమ్నీ
వేడుకలకు సన్నద్ధం

- డిసెంబర్ 7న మాసాబ్ ట్యాంక్‌లో నిర్వహణ



నాంపల్లి: మాసాబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల అలుమ్నీ వేడుకలకు సన్నద్ధం అవుతోంది. కళాశాల ప్రారంభమై 65 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు కళాశాల యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ వేడుకలను డిసెంబర్ 7న మాసాబ్ ట్యాంక్‌లోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించేందుకు మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల అలుమ్నీ అసోసియేషన్ కసరత్తు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు పూర్వ విద్యార్థులు కళాశాల సిబ్బంది సిద్ధమయ్యారు. పాలిటెక్నిక్ కళాశాల 1959లో ప్రారంభించారు. ఇక్కడ సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, కంప్యూటర్ సైన్స్ వంటి ఏడు రకాల కోర్సులను బోధిస్తున్నారు. సుమారు రెండు వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

అప్‌గ్రేడ్ దిశగా అడుగులు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు మహర్దశ పట్టుకుంది. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని కోస్గిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలు వచ్చాయి. ఇందులో భాగంగానే హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు మంచి రోజులు వస్తాయనే ఆశలు చిగురిస్తున్నాయి. అప్‌గ్రేడ్ అయ్యే కళాశాలల్లో మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల అగ్రస్థానంలో ఉంది. ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయితే అధునాతన భవన సముదాయాలు, హాస్టల్స్ నిర్మాణాలు జరుగుతాయి. ప్రస్తుతం కొనసాగుతున్న కళాశాల వర్షం వస్తే తరగతి గదులన్నీ తడిసి ముద్దవుతున్నాయి. ల్యాబోరేటరీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వసతి గృహంలో చాలా గదులన్నీ మూతపడ్డాయి. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా తయారయ్యింది. అప్‌గ్రేడ్ ఉత్తర్వులు వస్తే కార్పొరేట్ స్థాయి ఇంజినీరింగ్ కళాశాలగా రూపు మారిపోతుంది.

అప్‌గ్రేడేషన్ జరిగితే విద్యార్థులకు మేలు..



మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల అప్‌గ్రేడేషన్ జరిగితే విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. పాలిటెక్నిక్ కళాశాల ఇంజినీరింగ్ కళాశాలగా మారితే మెరుగైన వసతి సౌకర్యాలు అందుతాయి. పరికరాలు సమకూరడమే కాకుండా ఆధునిక హంగులతో లేబోరేటరీ అందుబాటులోకి వస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ మీద ప్రత్యేక దృష్టిని సారించడం అభినందనీయం. పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేసే యోచన చేయడం భావితరాలకు బంగారు బాటలు వేసినట్లు అవుతుంది. అదే విధంగా డిసెంబరు 7న కళాశాల ప్రాంగణంలో అలుమ్నీ వేడుకలను ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– చంద్రశేఖర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. మధర్‌డైరీ ఫీడర్ పరిధిలోని రాంనగర్ క్రాస్‌రోడ్, జయరాంరెడ్డి, మధర్స్ హైస్కూల్, లక్ష్మమ్మ పార్కు తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. ఎల్ఎన్‌నగర్ ఫీడర్ పరిధిలోని వారాసిగూడ, అంబర్‌నగర్, అశోక్‌నగర్ నాలా, పుల్లయ్యబావి తదితర ప్రాంతాలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు.. మూన్‌కేఫ్ ఫీడర్ పరిధిలోని శ్రీరాం నగర్, అచ్చయ్యనగర్, మూన్‌కేఫ్, హెరిటేజ్ ఫ్రెష్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, టూరిస్ట్ హోటల్ ఫీడర్ పరిధిలోని చప్పల్‌బజార్, బజాజ్ షోరూం, కాచిగూడ మెయిన్‌రోడ్, కుత్బిగూడ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

ముషీరాబాద్: బీజేపీ మరింత బలోపేతానికి పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో నియోజకవర్గం బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌రాం మాట్లాడుతూ.. యువత, మహిళలు పార్టీకి మరింత చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదును విజయవంతంగా కొనసాగిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జి కనకేష్‌కు మార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సదానంద్‌ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు జమాల్‌పురి నందు, ఆర్.విశ్వం, నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, నగర అధికార ప్రతినిధి బొల్లంపల్లి రాంరెడ్డి, ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బద్రినారాయణ, దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టికల్ 341ని సవరించి బిల్లు ఆమోదింపజేయాలి

కాచిగూడ: ఎస్సీ వర్గీకరణ కోసం ఆర్టికల్ 341ని సవరిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేయాలని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి చైర్మన్ క్రాంతికర్ పోకల కిరణ్‌మాదిగ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. బర్కత్‌పురలోని మహాకూటమి రాష్ట్ర కార్యాలయంలో చేపట్టిన ఈ దీక్షలో కిరణ్‌మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ రాష్ట్రంలో ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించే వరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు. సంగీత రాజలింగం మాదిగ, గొల్లపల్లి దయానందరావు, కళ్యాణ్ ప్రేమ్‌రాజ్, పుట్ట జంగన్న, కొప్పుల వినోద్ కుమార్ తదితరులు కిరణ్‌మాదిగకు మద్దతు తెలిపారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ముషీరాబాద్: రాంనగర్‌లోని ఎస్ఆర్‌డీ వృత్తి శిక్షణ కేంద్రంలో నిరుద్యోగులకు నాలుగు నెలల పాటు ఉచితంగా ఫౌండేషనల్ స్కిల్స్‌లో భాగంగా కంప్యూటర్ బేసిక్స్, ఇంగ్లిష్, ఇంటర్నెట్ పరిజ్ఞానం, టైపింగ్‌లపై నిపుణులైన వారితో శిక్షణ అందిస్తున్నట్లు ఎస్ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు వంద శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నామని ఏడాదికి 600 మంది యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పించి వారి జీవితాల్లో కొత్త వెలుగులను నింపుతున్నట్లు తెలిపారు. రాంనగర్ వృత్తిశిక్షణ కేంద్రంలో 15 రోజుల రిటైల్ ట్రైనింగ్‌కు 18–28 సంవత్సరాలలోపు గల యువకులు, ఎస్ఎస్‌సీ, ఇంటర్ కంప్లీట్ అయిన వారు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే కొత్త బ్యాచ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 80966 66902లో సంప్రదించాలని కోరారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సురెన్స్ కోర్సుకు దరఖాస్తు చేసుకునే డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు.

గోశాలలో ఆవులు ఉండటం శ్రేయస్కరం కాదు

రైతు సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌యాదవ్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలోని వివిధ ప్రాంతాలలో గోశాలల్లో గోవులు ఉండటం శ్రేయస్కరం కాదని వాటికి సరైన వ్యాయామం, ఆహారం లేక బక్కచిక్కిపోతున్నాయని రైతు సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము ప్రేమ్‌సాగర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గోశాలలో ఉన్న ఆవులు నానా గోసలు పడుతున్నాయని అన్నారు. గోశాలలో ఉండటం కన్నా రైతుల దగ్గరే ఉండటం శ్రేయస్కరమని అభిప్రాయపడ్డారు. గోశాలలో ఉన్న ఆవులకు సరైన ఆహారం దొరకకపోగా, సరైన వాతావరణం కూడా ఉండదన్నారు. రైతుల దగ్గర ఉంటే ప్రకృతిలో మమేకమై నేలమీద తిరుగుతూ పచ్చగడ్డిని మేస్తూ ఆరోగ్యంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన జనాభా 30 కోట్లు ఉండగా గోవుల సంఖ్య 130 కోట్లు ఉండేదని, ఇప్పుడు మన జనాభా 140 కోట్లకు పెరగగా గోవుల సంఖ్య 20 కోట్లకు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సృష్టిలో మానవునితో మమేకమై జీవించేవి పశువులేనని వాటిని రక్షించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

జేపీ నడ్డాకు ఆహ్వానం

కాచిగూడ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాను శుక్రవారం ఢిల్లీలో పార్టీ సంస్థాగత ఎన్నికల రాష్ట్ర కో రిటర్నింగ్ అధికారిణి కె.గీతామూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడి వివాహానికి రావాలని పెండ్లి పత్రికను ఆమె జేపీ నడ్డాకు అందజేశారు.

డిసెంబర్ 21న డ్రగ్స్ రహిత తెలంగాణ 2కే రన్

పంజగుట్ట: తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నెక్లెస్ రోడ్డులో డ్రగ్స్ రహిత తెలంగాణ 2 కే రన్ నిర్వహించనున్నట్లు తెలంగాణ విద్యా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండెం తారక్ గౌడ్, రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతులమీదుగా కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యా సమితి ప్రతినిధులు గణేశ్, అశోక్, సాయినాథ్, శ్రీను, పరమేశ్, రాజు,సంజయ్, మహేందర్, మారుతీ సంతోష్ పాల్గొన్నారు.